

జల్లికట్టు మైదానాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

గత గవర్నర్లకు తమిళ సంస్కృతి తెలుసు

'తమిళర్' అనే ట్యాగ్‌తో సమైక్యంగా ముందుకు సాగుదాం : సీఎం స్టాలిన్

● మదురైలో జల్లికట్టు మైదానం ప్రారంభం

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత గవర్నర్లకు తమిళ సంస్కృతీ సంప్రదాయాల గురించి బాగా తెలుసని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. 'తమిళర్' అనే ట్యాగ్‌తో తమిళ సాంస్కృతిక వేడుకలను సమైక్యంగా జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మదురై జిల్లా అలంగానల్లూరులో రూ.62 కోట్లతో నిర్మించిన 'కలైంజర్ శతవార్షిక స్మారక జల్లికట్టు' క్రీడా మైదానాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. 66.80 ఎకరాల్లో నిర్మించిన ఈ మైదానంలో ఇప్పటివరకు 77,683 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో క్రీడా మైదానాన్ని బుధవారం సీఎం స్టాలిన్ ప్రారంభించి ప్రసంగించారు. తమిళ సంప్రదాయ సాహస క్రీడ జల్లికట్టుకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. అలాంటి క్రీడకు ఒక మైదానాన్ని నిర్మించి ప్రారంభించడం వల్ల తన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు కావస్తోందని, ఈ మూడేళ్లలో మదురై జిల్లాలో మూడు ముఖ్య అభివృద్ధి పనులను పూర్తి చేసి జిల్లాకే తలమానికంగా నిలబెట్టామన్నారు. వాటిలో ఒకటి మదురై జిల్లా కీళడిలో పురావస్తు శాఖ మ్యూజియాన్ని అంతర్జాతీయస్థాయిలో నిర్మించామన్నారు. అలాగే, కలైంజర్ శతవార్షిక స్మారక గ్రంథాలయాన్ని నిర్మించి ప్రారంభించామన్నారు. ఇపుడు జల్లికట్టు క్రీడా మైదానాన్ని రూ.62 కోట్లతో నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు.

తైమాసంలో జల్లికట్టు పోటీలు...

యేటా తై మాసంలో జల్లికట్టు పోటీలు నిర్వహించడం సంప్రదాయంగా ఉందని సీఎం అన్నారు. అలంగానల్లూరు, అవనియాపురంలో నిర్వహించే పోటీలకు సాహస క్రీడాకారులు ఎంతో ఉరకలు వేసే ఉత్సాహంతో పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి సంప్రదాయ జల్లికట్టు క్రీడ ప్రపంచ స్థాయిలో చర్చించుకోవాలన్న ఏకైక ఉద్దేశంతోనే ఈ క్రీడా మైదానాన్ని నిర్మించాలని భావించామన్నారు. 1974లోనే చెన్నై నగరంలోనే జల్లికట్టు పోటీలను దివంగత కలైంజర్ నిర్వహించారన్నారు. రేక్లా పోటీలను 2006లో మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ నిషేధం విధించిందని, కానీ, ఈ పోటీలను కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహిస్తామని కోర్టుకు హామీ ఇచ్చి నిర్వహించిన ఘనత కలైంజర్‌కు దక్కుతుందన్నారు. 2007లో జల్లికట్టు క్రీడలపై సుప్రీం కోర్టు నిషేధం విధించగా, కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించి, విధించిన నిషేధాన్ని ఎత్తివేసి, పోటీలను నిర్వహించినట్టు గుర్తు చేశారు. 2014లో జల్లికట్టు పోటీలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడగా, 2017లో మన యువత మెరీనాతీరంలో మెరుపు పోరాటం చేశారని తెలిపారు. ఎంతో శాంతియుతంగా పోరాటం చేస్తూ వచ్చిన జల్లికట్టు ఉద్యమకారులపై నాటి అన్నాడీఎంకే ప్రభుత్వం సంఘ విద్రోశక్తులతో దాడి చేయించిందన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళలు, పోరాటాల ఫలితంగా జల్లికట్టు పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలను అడ్డుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా శాయశక్తులా ప్రయత్నించిందని ఆరోపించారు. గ్రామీణ క్రీడాకారులను పోత్సహించే ఖేలో ఇండియాలో కూడా జల్లికట్టు పోటీలు లేవని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపిందన్నారు. కానీ, తమ ద్రావిడ మోడల్ ప్రభుత్వం జల్లికట్టు అంటే కేవలం ఆటవిడుపు పోటీ కాదని, ధైర్యసాహసాలతో ప్రాణాలను పణంగా పెట్టి సాగే తమిళ సంప్రదాయ క్రీడా పోటీ అని న్యాయస్థానాల్లో గట్టిగా వాదించిందన్నారు. ఇలాంటి పోటీలు తమిళ సంస్కృతి సంప్రదాయంలో ఒక భాగమన్నారు.

అదేంటో... గుర్తుందా!


మదురైలో కేంద్రప్రభుత్వం నిర్మిస్తామన్న 'ఎయిమ్స్' ఆసుపత్రి గురించి సీఎం సర్మగర్భంగా వ్యాఖ్యానించారు. "కేంద్రంలోని బీజేపీ పాలకులు 2015లో మదురైలో ఒక అభివృద్ధి నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటివరకు అది రాలేదు. అదేంటో మీ అందరికి ఈ సందర్భంగా గుర్తుకు వస్తే నాకు సంబంధం లేదు" అని అన్నారు. చెన్నై నగరంలో త్వరలోనే కలైంజర్ స్మారక మందిరాన్ని ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

ఆ ఘనత కలైంజర్‌దే...

పేరరింజర్ అన్నా రాష్ట్రానికి తమిళనాడు అని పేరు పెట్టగా, తమిళ భాషకు సెమ్మొళి నామకరణం చేసిన ఘనత కలైంజర్‌కు దక్కుతుందని సీఎం అన్నారు. కులమతాలు అనేవి తమిళుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు తెరపైకి తీసుకొచ్చిన అంశాలన్నారు. వీటికి అతీతంగా తమిళుడు అనే ట్యాగ్‌తో రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ఐకమత్యంతో ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఐ.పెరియస్వామి, కేఎన్.నెహ్రూ, ఏ.వీ.వేలు, మూర్తి, పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ మైదానంలో నిర్వహించిన జల్లికట్టు పోటీలను సీఎంతో పాటు మంత్రులు తిలకించారు.

గవర్నర్ తేనీటి విందు బహిష్కరణ

● డీఎంకే కూటమి పార్టీల నిర్ణయం



చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చీటికిమాటికి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి డీఎంకే మిత్రపక్షాలు ఝలక్ ఇచ్చాయి. రాష్ట్ర ప్రయోజనాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గవర్నర్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చే తేనీటి విందును బహిష్కరించనున్నట్లు ప్రకటించాయి. దీనికి సంబంధించి డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, డీపీఐ, ఎండీఎంకే వంటి పార్టీలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. 'రిపబ్లిక్ డే' సందర్భంగా స్థానిక రాజ్‌భవన్‌లో గవర్నర్ 'ఎట్ హోం' పేరుతో తేనీటి విందు ఇచ్చే విషయం తెలిసిందే. ఈ విందులో ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార, ప్రతిపక్ష ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో, ఈనెల 26న శుక్రవారం నిర్వహించనున్న గవర్నర్ తేనీటి విందు కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు డీఎంకే మిత్రపక్షాలు ప్రకటించాయి. రాష్ట్ర గవర్నర్‌గా 2021 సెప్టెంబరు 18వ తేది బాధ్యతలు చేపట్టిన ఆర్ఎన్ రవి నిత్యం ప్రభుత్వానికి, రాష్ట్రప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆయా పార్టీల నేతలు ఆరోపించారు. శాసనసభలో ప్రభుత్వం నెరవేర్చే బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వానికి సహకరించడం గవర్నర్ బాధ్యత అని, వాటిని ఆయన విస్మరించారని దుయ్యబట్టారు. ఆయన గవర్నర్‌లా కాకుండా బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని, ఆ చర్యలు నిరసిస్తూ తేనీటి విందును బహిష్కరిస్తున్నట్లు ఆయా పార్టీల నేతలు ప్రకటించారు. కానీ అధికార పార్టీ అయిన డీఎంకే నిర్ణయం వెలువడాల్సి ఉంది.

పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేయను

● టీటీవీ దినకరన్



పెరంబూర్, జనవరి 24: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తేల్చి చెప్పారు. తిరువళ్లూర్‌లో చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నిర్వాహకులు, పర్యవేక్షకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న దినకరన్ మాట్లాడుతూ... అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జాతి, మతాలకు అతీతంగా జరిగిందన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో విద్యార్థులు తప్పకుండా పాల్గొనాలనే వర్సిటీ ఉపకులపతి జారీ చేసిన ప్రకటనలో ఎలాంటి తప్పు లేదన్నారు. అన్నాడీఎంకేలోని వర్గాలన్నీ ఒకటిగా చేరాలన్నది తమ అభిప్రాయమన్నారు. అదే సమయంలో ఎడప్పాడితో జతకట్టే ప్రసక్తే లేదని అన్నారు. కొడనాడు హత్య, దోపిడీ కేసు నిందితులను త్వరగా గుర్తించేలా పోలీసులు విచారణ ముమ్మరం చేయాలన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై పలు పార్టీలతో చర్చలు జరుపుతున్నామని అయితే ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని టీటీవీ స్పష్టం చేశారు.

కార్యక్రమంలో నేతలు



కార్యక్రమానికి హాజరైన ప్రజలు



పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య సౌకర్యాల అంతరం తొలగాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాల పరంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ప్రైవేట్ రంగం, ఎన్జీవోలు, దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం విరుదునగర్ జిల్లా సాత్తూరులోని ఎస్.రామస్వామి నాయుడు స్మారక కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఈ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కాలేజీ ఒక గొప్ప వ్యక్తి దార్శనికత, అంకితభావం, విజనరీకి ప్రతిరూపంగా నిలిచిందన్నారు. తాను కూడా విద్యను అభ్యసించేందుకు ఒక రైతు బిడ్డగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నట్టు వెల్లడించారు. విద్య, ఉపాధి, ఇతర అవకాశాలు గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే తన బలమైన ఆకాంక్ష అని పేర్కొన్నారు. కీలకమైన విద్య, ఆరోగ్య రంగాలకు చెందిన వారు కలిసివచ్చినపుడే గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి సాధ్యపడుతుందన్నారు.సౌకర్యాల పరంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ప్రైవేట్ రంగం, ఎన్జీవోలు, దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రామస్వామి నాయుడు ఒక దేశభక్తుడు మాత్రమే కాదని, గ్రామీణ విద్యపై దృష్టిసారించిన అసాధారణమైన పండితుడు, దూరదృష్టి గల నాయకుడు అని కొనియాడారు. ఆయన విశాల దృక్పథంలో దశాబ్దాల క్రితమే పేద పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారని వెంకయ్య గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపక సిబ్బందితో పాటు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పోయెస్ గార్డెన్‌లో శశికళ

● జయ నివాసం ముందే కొత్త ఇంటి గృహ ప్రవేశం

పెరంబూర్, జనవరి 24: తన నెచ్చెలి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత జ్ఞాపకాలతో కాలం వెళ్లదీస్తున్న అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ... ఎట్టకేలకు మళ్లీ పోయెస్ గార్డెన్‌కు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న జయ నివాసంలో ఆమెతో కలిసి సుదీర్ఘకాలం జీవించిన శశికళ.. ఆమె మరణానంతరం ఆ ఇంటికి దూరమైన విషయం తెలిసిందే. ఆ తరువాత జయ ఇంటి ఎదురుగానే మరో ఇంటిని నిర్మించుకునేందుకు సన్నాహాలు చేపట్టారు. భారీస్థాయిలో నిర్మితమైన ఆ ఇల్లు ఇప్పటికి సిద్ధమైంది. దీంతో బుధవారం ప్రత్యేక పూజల అనంతరం ఆమె గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో దగ్గరి బంధువులు మాత్రమే పాల్గొన్నారు. జయలలిత పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయంలో నివసించారు. ఆమెతో కలిసి శశికళ 30 ఏళ్లపాటు కలసి ఉన్నారు. 2016లో జయ మరణానంతరం ఆ ఇంటిని స్మారక మందిరంగా మార్చాలని అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జయ మేనకోడలు, మేనల్లుడు దాఖలుచేసిన పిటిషన్ విచారించిన న్యాయస్థానం... వేద నిలయాన్ని దీప, దీపక్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, అక్రమార్జన కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష విధించబడి బెంగళూరు జైలులో ఉన్న శశికళ... విడుదలైన అనంతరం వర్గాలుగా విడిపోయిన అన్నాడీఎంకేను ఒకటి చేయాలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. ఆ తరువాత పలు జిల్లాల్లో తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో టి.నగర్‌లోని తన సోదరి ఇంట్లో శశికళ ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రకటనలకే పరిమితమైన శశికళ... ఏడేళ్ల అనంతరం తొలిసారిగా రెండు రోజుల క్రితం నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌కు వెళ్లారు. ఎస్టేట్ ప్రాంగణంలో జయలలిత విగ్రహం, స్మారక మందిరం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అదే సమయంలో పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయం ఎదురుగా ఉన్న స్థలంలో అత్యాధునిక వసతులతో కూడిన బంగ్లా నిర్మాణ పనులను 2020లో శశికళ ప్రారంభించారు. అనంతరం ఆ ఇంటిని జప్తు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నోటీసు అంటించడంతో పనుల్లో జాప్యం జరిగింది. అలాగే, శశికళకు సొంతమైన రూ.1,520 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ స్తంభింపజేసింది.ఆ ఆస్తులకు సంబంధించి రూ.480 కోట్లు విడుదలయ్యాయి. అనంతరం పోయెస్ గార్డెన్‌లో ఇంటి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. బుధవారం ఉదయం శశికళ ఆ ఇంట్లో గృహప్రవేశం చేశారు. ఉదయం గోపూజ, వినాయక పూజల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం కొత్త ఇంట్లో పాలు పొంగించారు.



గృహప్రవేశంలో శశికళ



జాలర్లను అభినందిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

నిజమైన దేవుళ్ళు జాలర్లే

● మంత్రి ఉదయనిధి

అడయార్, జనవరి 24: ఇతరుల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే వారే నిజమైన దేవుళ్లని ఆ కోణంలో చూస్తే జాలర్లు నిజమైన దేవుళ్లని రాష్ట్ర యువజన, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి వ్యాఖ్యానించారు. గతయేడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాను సమయంలో సముద్రతీర ప్రాంత గ్రామాల వారిని జాలర్లు రక్షించారు. క్షేత్రస్థాయిలో సాహసోపేతంగా పనిచేసిన జాలర్లను ప్రభుత్వం గుర్తించి, వారిని సన్మానిస్తోంది. ఇటీవల దక్షిణాది జిల్లాలకు చెందిన జాలర్లను సన్మానించగా, బుధవారం ఉత్తరాది జిల్లాలకు చెందిన జాలర్లకు సన్మాన కార్యక్రమం స్థానిక రాయపేటలోని వైఎంసీఏ మైదానంలో జరిగింది. మంత్రి అనితా రాధాకృష్ణన్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయనిధి ముఖ్య అతిథిగా పాల్గొని జాలర్లను అభినందించి, ప్రసంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... మిచౌంగ్ తుఫాను సమయంలో ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని తెలిపారు. ముఖ్యంగా సహాయక చర్యల్లో జాలర్లు ధైర్యసాహసాలతో పాల్గొన్నారన్నారు. అలాంటి జాలర్లపై ప్రభుత్వానికి ఎల్లపుడూ ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. జాలర్లు కూడా ప్రభుత్వానికి ఏ క్షణమైనా అండగా ఉంటారని గుర్తు చేశారు. మదురైలోని అలంగానల్లూరులో జల్లికట్టు మైదానాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభిస్తున్నారన్నారు. తాను ఆ శాఖకు మంత్రిగా ఉన్నప్పటికీ ఆ కార్యక్రమానికి వెళ్లకుండా జాలర్లకు సన్మానానికి వచ్చానని ఆయన గుర్తు చేశారు. ఇక్కడ జల్లికట్టు గురించి ప్రస్తావించడం చాలా మందికి అప్రస్తుతంగా అనిపిస్తుందన్నారు. కానీ, 2017లో జల్లికట్టు కోసం జరిగిన పోరాటంలో యువకులతో కలిసి జాలర్లు కూడా కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ పోరాటాన్ని జాలర్లే ముందుండి నడిపించారని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, తమను నమ్మిన వారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను జాలర్లు రక్షిస్తారన్నారు. నిజానికి తనకు దైవభక్తి లేదన్నారు. కానీ, తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను రక్షించేవారే నిజమైన దేవుళ్లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1200 మంది జాలర్లను అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేయగా, రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ఆర్.ప్రియ పాల్గొన్నారు.

37 ఎంపీ నియోజవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

అడయార్, జనవరి 24: పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు కొద్ది నెలలు మాత్రమే ఉన్న నేపథ్యంలో, రాష్ట్ర ఓటరు జాబితాను ఎన్నికల కమిషనర్ సత్యప్రదసాహు సోమవారం విడుదల చేశారు. ఈ జాబితాలో 205 అసెంబ్లీ, 37 పార్లమెంటు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 2014 పార్లమెంటు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అప్పుడు పురుషుల కంటే 3,237 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం పురుషుల కంటే 10,89,294 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో 15 నియోజకవర్గాల్లో మాత్రమే పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం మహిళా ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల సంఖ్య 37కు పెరిగింది. కృష్ణగిరి, ధర్మపురి నియోజకవర్గాల్లో మాత్రమే పురుషులు అధికంగా ఉన్నారు. ఇక ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండే అవకాశముంది.



బుధవారం చెన్నైలో ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ప్రచారం కల్పిస్తున్న విద్యార్థినులు

కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు

యజమానుల సంఘం ప్రకటన ● ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతర్

పెరంబూర్, జనవరి 24: స్థానిక కిళంబాక్కం బస్ టెర్మినల్ నుంచి బస్సులు నడిపే విషయమై అటు ప్రభుత్వానికి, ఇటు ఆమ్నీ బస్సుల యాజమానులకు మధ్య విభేదాలు తలెత్తడంతో ఇబ్బంది పడడం ప్రయాణికుల వంతైంది. కోయంబేడు బస్ టెర్మినల్‌లో రద్దీ నియంత్రించేలా వండలూరు సమీపం కిళంబాక్కంలో అధునిక వసతులతో బస్ టెర్మినల్‌ను గత నెలలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ బస్ టెర్మినల్ నుంచే దక్షిణాది జిల్లాలకు వెళ్లే అన్నిరకాల ప్రభుత్వ, ఆమ్నీ బస్సులు నడుస్తాయని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ ప్రకటించారు. అలాగే, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కిళంబాక్కం బస్ టెర్మినల్‌కు ఎంటీసీ బస్సులు ఏర్పాటయ్యాయి. సంక్రాంతి సందర్భంగా దక్షిణాది జిల్లాలకు వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు కిళంబాక్కం బస్ టెర్మినల్‌కు రావాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ప్రకటించింది. అలాగే, కోయంబేడుకు బదులుగా కిళంబాక్కం నుంచి బస్సులు నడపడంతో ప్రయాణికుల నుంచి వసూలుచేసిన చార్జీని కూడా తగ్గించారు. అయితే, ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా కోయంబేడు నుంచే బస్సులు నడుపుతామని ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం ప్రకటించింది. వారి విజ్ఞప్తి పరిశీలించిన ప్రభుత్వం, ఈ నెల ఆమ్నీ బస్సుల యజమానులకు అవకాశం కల్పించింది.

కిళంబాక్కం నుంచే ...

దక్షిణాది జిల్లాలకు వెళ్లే ఆమ్నీ బస్సులు కిళంబాక్కం నుంచే నడుస్తాయని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. నగరంలో బుధవారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... యజమానుల కోరిక మేరకు కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు నడిపేందుకు ఇదివరకు అనుమతించామన్నారు. కానీ, ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం రాత్రి 7 గంటల నుంచి అన్నిరకాల ఆమ్నీ బస్సులు కిలంబాక్కం నుంచే నడపాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అదే సమయంలో నగరంలో ఆమ్నీ బస్సులు ప్రయాణికులను తీసుకెళ్లడం, దించేందుకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించే ఆమ్నీ బస్సులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు...

కిళంబాక్కం బస్ టెర్మినల్‌లో తగిన వసతులు లేవని, అందువల్ల కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు నడుపుతామని ఆ బస్సుల యజమానుల సంఘం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనలు పాటించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే కిళంబాక్కంలో తగిన వసతులు లేవన్నారు. కిళంబాక్కంనుంచి నగరంలోని ప్రయాణికులు వచ్చేందుకు రవాణా సౌకర్యాలు కూడా లేవన్నారు. ఈ ప్రాంతంలో సబర్బన్, మెట్రో రైల్వేస్టేషన్లు ఏర్పాటైతే ప్రయాణికులు వసతిగా ఉంటుందని, అప్పటివరకు కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు నడుపుతామని యజమానుల సంఘం ప్రకటించింది.

సమాచార ధ్వని

ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు

అడయార్, జనవరి 24: శుక్రవారం రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడువనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేది (శుక్రవారం) చెన్నై బీచ్ - తాంబరం, చెంగల్పట్టు, మూర్‌మార్కెట్ - తిరువళ్లూర్ - అరక్కోణం, మూర్ మార్కెట్ - గుమ్మిడిపూండి - సూళ్లూరుపేట ప్రాంతాలకు వెళ్లే సబర్బన్ రైళ్లు, చింతాద్రిపేట - వేళచ్చేరి ఎమ్మార్టీఎస్ రైళ్లు ఆదివారం టైంటేబుల్ ప్రకారం నడుస్తాయని దక్షిణ రైల్వే తెలియజేసింది.

నేడు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఐసిఎఫ్, జనవరి 24: తైపూసం రోజైన గురువారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 575 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా, వాటిలో 10 మాత్రమే శనివారాల్లో పని చేస్తున్నాయి. శుభముహూర్తాలు, తమిళ సంవత్సరాది, ఆడిపెరుక్కు, తైపూసం వంటి విశేష దినాల్లో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈ రోజుల్లో రిజిస్ట్రేషన్లు కూడా అదనపు ఆదాయం లభిస్తుండడంతో, సెలవు రోజైనప్పటికీ, కార్యాలయాలు తెరచి రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారు. ఈ క్రమంలో, తైపూసం సందర్భంగా ఈనెల 25వ తేది రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. అయితే రిజిస్ట్రేషన్‌కు అదనంగా రూ.350 చెల్లించాలని అధికారులు తెలిపారు.

తైపూసం, గణతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, జనవరి 24: తైపూసం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలవులను పురస్కరించుకొని వివిధ ప్రాంతాలకు చెన్నై నుంచి 580 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తెలిపింది. తైపూసం, గణతంత్ర దినోత్సవం, శని, ఆదివారాలు అని వరుసగా సెలవులు వస్తున్నాయి. ప్రతిరోజు నడిపే బస్సులతో పాటు అదనంగా 405 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోవై, మదురై, తిరునల్వేలి, తిరుచ్చి వంటి ప్రాంతాల నుంచి ప్రధాన నగరాలకు 175 ప్రత్యేక బస్సులు అని మొత్తం 580 బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన చిన్న ఉల్లి ధరలు

ఐసిఎఫ్, జనవరి 24: దిగుబడులు పెరగడంతో మార్కెట్లో చిన్న ఉల్లి ధర తగ్గింది. రాష్ట్రంలోని రాశిపురం, దురైయూర్ వంటి ప్రాంతాలు, మైసూరు నుంచి చిన్న ఉల్లి దిగుమతి అవుతోంది. సాధారణంగా 150 టన్నులు మార్కెట్‌కు దిగుమతి అవుతుండగా, ప్రస్తుతం 475 టన్నుల మేరకు దిగుమతి అవుతోంది. దీంతో, కిలో రూ.20కు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

మెస్ చార్జీల పెంపు

పెరంబూర్, జనవరి 24: బీసీ, ఎంబీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు, కళాశాలల హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విడిది గృహాల్లోని విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న మెస్ చార్జీ రూ.1,000నుంచి రూ.1,400, కళాశాల విడిది గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు రూ.1,100 నుంచి రూ.1,500 వరకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం రూ.9.56 కోట్లను కేటాయించినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది.

'ఆన్‌లైన్ రిజర్వేషన్' ప్రారంభించిన హౌసింగ్ బోర్డు

పెరంబూర్, జనవరి 24: హౌసింగ్ బోర్డు పథకాల్లో గృహాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న వారు 'ఆన్‌లైన్'లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. దీనిపై హౌసింగ్ బోర్డు అధికారి మాట్లాడుతూ... హౌసింగ్ బోర్డు నిర్మించిన గృహాల వివరాలు ప్రజలు తెలుసుకొనేలా వెబ్‌సైట్‌లో ప్రత్యేక వసతి కల్పించామన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఏఏ పథకాలున్నాయి. వాటిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గృహాల వివరాలను బోర్డు వెబ్‌సైట్ tnhb.tn.gov.in నుంచి తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతం వెబ్‌సైట్ ద్వారా గృహాన్ని ఎంపిక చేసుకొని, దాని కొనుగోలుకు ముందస్తు రిజర్వేషన్ కోసం దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. చెన్నై నెర్కుండ్రం పథకంలో ఆన్‌లైన్ ముందస్తు రిజర్వేషన్‌కు తొలివిడతగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర ప్రాంతాల వివరాలు త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

బ్యాంకులకు నాలుగు రోజులు సెలవు

ఐసిఎఫ్, జనవరి 24: జాతీయ, ప్రైవేటు శాఖ బ్యాంకులకు తైపూసం, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని గురు, శుక్రవారాలు, నాల్గో శనివారం, ఆదివారం అని నాలుగు రోజులు సెలవులు ప్రకటించారు. ప్రస్తుతం వినియోగదారులు మొబైల్ ఫోన్‌లో గూగుల్‌పే, ఫోన్‌పే అని డిజిటల్ నగదు పరివర్తన చేపట్టడంతో బ్యాంకులకు సెలవులు ప్రకటించినా, నగదు డ్రా చేయడం, డిపాజిట్ చేయడంలో ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు.

నేడు వడ పళనిలో తైపూస ఉత్సవాలు

ఐసిఎఫ్, జనవరి 24: స్థానిక వడ పళని ఆండవర్ ఆలయంలో తైపూస ఉత్సవాలు గురువారం జరుగనున్నాయి. యేటా తైమాసం పూస నక్షత్రం, పౌర్ణమి తిథి రోజున సుబ్రమణ్యస్వామికి నిర్వహించే ఉత్సవాలే తైపూస ఉత్సవాలు. ఈ సందర్భంగా గురువారం వేకువజామున 4 గంటలకు ఆలయానికి తెరచి, 4.30 గంటలకు తిరుపల్లి, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భక్తులు తీసుకొచ్చే పాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులు స్వామిని దర్శించేందుకు అనుమతి కల్పించారు. రాత్రి 8.30 గంటలకు వెండి నెమలి వాహనంపై కొలువుదీరిన స్వామివారు నాలుగు మాఢవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కావళ్లు మోసేవారు, ప్రత్యేక మొక్కులు చెల్లించుకొనే వారిని దక్షిణ గోపురం ద్వారంలో అనుమతిస్తారు. భక్తులందరికీ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రసాద పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

1న కావేరి మండలి సమావేశం

ఐసిఎఫ్, జనవరి 24: కావేరి నిర్వాహక మండలి సమావేశం ఫిబ్రవరి 1వ తేది జరగనుంది. రాష్ట్రానికి యేటా 177.25 టీఎంసీలు కావేరి జలాలను కర్ణాటక ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. 2023 జూన్ నుంచి ఇప్పటివరకు 90.6 టీఎంసీల జలాలు విడుదల చేయకుండా కర్ణాటక నిర్లక్ష్యం చేస్తోంది. ఈ నీరు విడుదల చేస్తేనే వేసవిలో తాగునీటి అవసరాలు, డెల్టా జిల్లాల సాగు అవసరాలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 1వ తేది ఢిల్లీలో జరిగే సమావేశంలో సక్రమంగా నీటిని విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కేంద్రప్రభుత్వాన్ని రాష్ట్రం కోరనుంది.

ఫిజియోథెరపీ క్లినిక్ ఏర్పాటుకు రుణసాయం

ఐసిఎఫ్, జనవరి 24: థాడ్కో ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్లినిక్ ఏర్పాటుచేసే వారికి రుణసాయం అందించనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మిసిద్ధార్థ్ తెలిపారు. డిగ్రీ, డిప్లొమా చేసిన 40 ఏళ్లలోపున్న ఎస్సీ, ఎస్టీలు క్లినిక్ ఏర్పాటుకు రుణసాయం థాడ్కో అందజేయనుందని తెలిపారు. ఔత్సాహికులు థాడ్కో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దోమల బెడద తట్టుకోలేకున్నాం!

కౌన్సిల్ సమావేశంలో అన్నాడీఎంకే కౌన్సిలర్ వినూత్న నిరసన



దోమతెర ధరించిన అన్నాడీఎంకే కౌన్సిలర్ తంగవేల్

పెరంబూర్, జనవరి 24: తిరుప్పూర్ జిల్లా అవినాశి సమీపం తిరుమురుగన్ పూండి మున్సిపాలిటీ సమావేశం మంగళవారం జరిగింది. మున్సిపాలిటీ అధ్యక్షుడు కుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆండవన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వరి పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో, 16వ వార్డు అన్నాడీఎంకే కౌన్సిలర్ తంగవేలు, తన వార్డులో దోమల బెడద అధికంగా ఉందని పేర్కొంటూ, సమావేశానికి దోమ తెర ధరించి హాజరయ్యారు. అలాగే, రాక్కియపాళయం - ఉమ్మైచెట్టిపాళయం రోడ్డు జగన్నాథన్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ నీటిని తొలగించకపోవడంతో దోమల బెడద అధికమై ప్రజలు రోగాల పాలవుతున్నారని ఆయన పేర్కొన్నారు. దోమల బెడదకు చర్యలు చేపడతామని అధ్యక్షుడు కుమార్ హామీ ఇవ్వడంతో ఆయన దోమ తెర తీసి వేసి సమావేశంలో పాల్గొన్నారు.

శ్రీలంక విమానం రద్దు

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి శ్రీలంక వెళ్లాల్సిన విమానాన్ని ఆకస్మికంగా రద్దు చేయడంతో అందులో ప్రయాణించాల్సిన 130 మంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి చెన్నైకు బుధవారం వేకువజామున 2 గంటలకు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం బయలుదేరాల్సివుంది. అయితే ఈ విమానం చెన్నై నుంచి కొలంబోకు 3 గంటలకు బయలుదేరి వెళతుందని సంబంధిత అధికారులు ప్రకటించారు. నిజానికి కొలంబో నుంచి చెన్నై వచ్చే విమానమే తిరిగి అక్కడకు వెళ్లాల్సివుంది. కానీ అక్కడి నుంచి రావాల్సిన విమానం సాంకేతిక సమస్యల కారణంగా చెన్నై చేరుకోలేకపోయింది. దీంతో ఇక్కడ 2 గంటలకు బయలుదేరాల్సిన విమానాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ఆలస్యంగా ప్రకటించారు. దీంతో ఈ విమానంలో ప్రయాణించాల్సిన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వీరిలో కొందరు తమ ప్రయాణ టిక్కెట్లను రద్దు చేసుకోగా, మరికొందరు మరో తేదీలో ప్రయాణించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకున్నారు.

30 లక్షల విద్యుత్ మీటర్ల కొనుగోలు

ఐసిఎఫ్, జనవరి 24: రాష్ట్ర విద్యుత్ బోర్డు 30 లక్షల మీటర్లు కొనుగోలుకు నిర్ణయించింది. విద్యుత్ వినియోగం గణించేందుకు స్టాటిక్ అనే మీటర్లు అమర్చుతున్నారు. రెండు నెలలకు ఒకసారి ఉద్యోగులు మీటరు రీడింగ్ తీస్తున్నారు. కొన్ని సమయాల్లో సకాలంలో మీటరు చూడకపోవడంతో వినియోగదారులు విద్యుత్ బిల్లుతో పాటు జరిమానా కూడా చెల్లించాల్సి వస్తోంది. వీటిని అడ్డుకొనేందుకు ఆటోమేటిక్‌గా పనిచేసే స్మార్ట్ మీటరు ఏర్పాటుచేయాలని ఈబీ నిర్ణయించింది. టెండర్ల విడుదలలో జాప్యం జరగడంతో ప్రస్తుతం 30 లక్షల స్టాటిక్ మీటర్లు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

100 గ్రామాలకు సౌరశక్తి విద్యుత్

ఐసిఎఫ్, జనవరి 24: రాష్ట్రప్రభుత్వం తొలివిడతగా 100 గ్రామాలకు సౌర విద్యుత్ సరఫరా చేసేందుకు నిర్ణయించింది. సోలార్ విద్యుత్ కేంద్రాల నుంచి ఏడాదికి 300 రోజులకు పైగా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఈ విషయమై విద్యుత్ బోర్డు అధికారులు మాట్లాడుతూ.. కిలోవాట్ సోలార్ విద్యుత్ కేంద్రం నుంచి 5 యూనిట్ల విద్యుత్ లభిస్తుందని, గ్రామంలో సుమారు 250 లోపు ఇళ్లు ఉండడంతో 250, 500 కిలోవాట్ సామర్థ్యంతో విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అక్కడున్న గృహాలకే సరఫరా చేస్తామని తెలిపారు.

రూ.12.9 కోట్లతో అతిథి భవనం

ఐసిఎఫ్, జనవరి 24: మద్రాసు హైకోర్టు మదురై శాఖ న్యాయమూర్తులకు రూ.12.9 కోట్లతో అతిథిభవనం నిర్మించనున్నారు. మదురై శాఖకు 22,929 చ.మీ విస్తీర్ణంలో నాలుగు అంతస్తులతో నిర్మించిన భవనంలో 24 కోర్టు హాళ్లున్నాయి. ఇవి మాత్రమే కాకుండా న్యాయమూర్తుల ఛాంబర్, స్టెనో రూం, సందర్శకుల గది వంటి భవనాలు 15,209 చ.మీ విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, న్యాయమూర్తుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో అతిథి భవనం నిర్మించేందుకు నిర్ణయించిన ప్రభుత్వం, రూ.12.9 కోట్లు కేటాయించింది.

ఎంజీఆర్‌కు ఘననివాళి

వేలూరు, జనవరి 24: దివంగత మాజీ ముఖ్య మంత్రి ఎంజీఆర్ 107వ జయంతి ఉత్సవాలు బుధవా రం ఘనంగా నిర్వహించారు. జిల్లా సెక్రటరీ, మండల బాధ్యులు, ఎన్నికల విభాగం సెక్రటరీ పార్తిబన్ సలహా మేరకు నార్త్ యూనియన్ పార్టీ సెక్రటరీ రాజమణి నేతృత్వంలో వాలాజా బీడీఓ కార్యాలయం సమీపంలోని ఎంజీఆర్ విగ్రహానికి పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ సెక్రటరీలు, నగర నిర్వాహకులు, యూనియన్ నిర్వాహకులు, జిల్లా, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై కేసుల కొట్టివేత

అడయార్, జనవరి 24: అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగంపై నమోదైన రెండు కేసులను మద్రాస్ హైకోర్టు కొట్టి వేసింది. కొత్త కార్మిక చట్టం మేరకు 12 గంటలపై రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ, రాష్ట్రం నుంచి ఉత్తరాది కార్మికులు బహిష్కరణ, గంజా వినియోగం పెరిగిపోవడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన విమర్శలు గుప్పించారు. దీంతో డీఎంకే నేతలు ఆయనపై చేసిన ఫిర్యాదు మేరకు విల్లుపురంలో కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణ విల్లుపురం కోర్టులో సాగుతున్నాయి. అయితే, ఈ కేసులను రద్దు చేయాలని కోరుతూ ఆయన మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరువర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి ఆనంద్ ఎన్.వెంకటేష్.. రెండు కేసులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నేడు భాషోద్యమకారుల సంస్మరణ దినోత్సవం

● అన్నానగర్ సభకు అతిథిగా సీఎం స్టాలిన్

అడయార్, జనవరి 24: భాషోద్యమకారుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నానగర్‌లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. స్థానిక అంజికరైలోని పచ్చయప్పాస్ కాలేజీ ఎదురుగా ఉన్న సెయింట్ జార్జి స్కూల్‌లో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయగా, ఇందులో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి సిట్రరసు నేతృత్వం వహిస్తారు. ఇందులో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు దయానిధి మారన్, కళానిధి వీరాస్వామి, ఎంకే మోహన్ సహా పలువురు శాసనసభ్యులు, స్థానిక డీఎంకే నేతలు తదితరులు పాల్గొంటారు.

నేడు మాంసం దుకాణాల మూసివేత

అడయార్, జనవరి 24: తైపూసోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక మరైమలర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మాంసం దుకాణాలను మూసి వేయాలని నగర కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. దుకాణాలను తెరిచివుంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరందూర్ విమానాశ్రయ స్థల సేకరణ వ్యవహారం రాష్ట్రప్రభుత్వానిదే!

● కేంద్ర మంత్రి వీకే సింగ్

పెరంబూర్, జనవరి 24: పరందూర్ విమానాశ్రయానికి సంబంధించిన ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వమే ఎంపిక చేసిందని కేంద్రమంత్రి వీకే సింగ్ తెలిపారు. తిరునల్వేలిలో కేంద్రప్రభుత్వ పథకాలకు ప్రజలకు వివరించేలా మంగళవారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కేంద్రమంత్రి విలేకరులతో మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ప్రకటనల కోసం పనిచేయడం లేదన్నారు. వాహనం నడవాలంటే అన్ని విడిభాగాలు కలిసే ఉండాలని, అలాగే, దేశాభివృద్ధికి అన్ని రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం సఖ్యతగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. తూత్తుకుడి విమానాశ్రయ విస్తరణ పనులు జరుగుతున్నాయని, పరందూర్ విమానాశ్రయ స్థల సేకరణకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తమ వ్యవసాయ భూములు కోల్పోతున్నామని కొన్ని గ్రామాల రైతులు ఆందోళన చేపడుతున్నారని, అందువల్ల ప్రజలకు ఇబ్బందులు లేని భూములను రాష్ట్రప్రభుత్వం సేకరించాలని కేంద్రమంత్రి సూచించారు.

28న డీఎంకే - కాంగ్రెస్ సీట్ల సర్దుబాటుపై చర్చలు

అడయార్, జనవరి 24: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఈనెల 28వ తేదీన డీఎంకే, కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ సీట్ల పంపిణీపై చర్చల కోసం డీఎంకే తరపున పార్టీ సీనియర్ నేత, ఎంపీ టీఆర్ బాలు నేతృత్వంలో కమిటీని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ఈ కమిటీతో కాంగ్రెస్ నేతలు ఈనెల 28న తేనాంపేటలోని అన్నా అరివాలయంలో చర్చించనున్నారు. కాగా, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12 నుంచి 15 సీట్లను డిమాండ్ చేస్తున్న విషయం తెల్సిందే. అయితే, డీఎంకే మాత్రం 9 లేదా 10 సీట్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

అన్నాడీఎంకే ఎన్నికల కమిటీలు

● నేడు తొలి సమావేశాలు

అడయార్, జనవరి 24: రాబోయే పార్లమెంటు ఎన్నికల కోసం అన్నాడీఎంకే ఏర్పాటు చేసిన కమిటీలు ఈనెల 25న గురువారం తొలిసారిగా సమావేశం కానున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, బీజేపీ కూటమి, నామ్ తమిళర్ కట్చి అని చతుర్ముఖ పోటీ నెలకొంది. ఆయా కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటుకు సంబంధించి చర్చించేందుకు ఏర్పాటైన కమిటీలు ఇప్పటికే తొలివిడత చర్చలు పూర్తిచేశాయి. అదే సమయంలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన కసరత్తు కూడా చేపట్టిన పార్టీలు, ఫిబ్రవరి మొదటి వారంలో తొలి జాబితా విడుదల చేసే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఏ పార్టీలతో కూటమి ఏర్పాటుపై ఇంకా స్పష్టం లేని అన్నాడీఎంకే, సీట్ల సర్దుబాటు, ఎన్నికల మేనిఫెస్టో, ప్రచారం, ఎన్నికల పనులు అని నాలుగు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ నాలుగు కమిటీలు గురువారం సమావేశంలో చర్చించనున్నాయని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

ఓటు విలువ అవగాహన ప్రతిజ్ఞ



కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ నేతృత్వంలో ప్రతిజ్ఞ

వేలూరు, జనవరి 24: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్, వివిధ శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పల్లికొండ పంచాయతీ కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఉద్యోగులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

మేల్‌అరసంపట్టు నుంచి చెన్నైకి బస్సు సేవలు ప్రారంభం



బస్సు సేవలు ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

వేలూరు, జనవరి 24: ఆనైకట్టు డివిజన్ మేల్‌అరసంపట్టు నుంచి చెన్నైకి కొత్త బస్సు సర్వీసును కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నందకుమార్, పంచాయతీ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు యూనియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరన్, రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య ఉచిత శిబిరం



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

వేలూరు, జనవరి 24: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 107వ జయంతి సందర్భంగా వేలూరు కార్పొరేషన్ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కంటి వైద్య ఉచిత శిబిరం బుధవారం జరిగింది. కాట్పాడి సమీపం సెంగుట్టలో జరిగిన ఈ శిబిరాన్ని అన్నాడీఎంకే కార్యదర్శి ఎస్ఆర్కే అప్పు ప్రారంభించారు. ఈ సందర్భంగా 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు, న్యాయవాదుల విభాగం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కోలాహలంగా జల్లికట్టు



జల్లికట్టు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు, జనవరి 24: కనియంబాడి సమీపం కమ్మవాన్‌పేట(సైనికపేట)లో బుధవారం తమిళుల సంప్రదాయ, సాహస క్రీడ జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూర్, రాణీపేట జిల్లాలకు చెందిన 150కి పైగా ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు, సర్టిఫికెట్లు అందించారు. కమ్మవాన్‌పేట పంచాయతీ యూనియన్ అధ్యక్షులు కవిత మురుగన్, కనియంబాడీ పీఎంకే యూనియన్ కమిటీ సభ్యుడు జయలక్ష్మి ఏలుమలై తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎద్దులు పొడిచి గాయపడిన పలువురిని అంబులెన్స్ ద్వారా వేలూరు అడుక్కమ్‌పారైలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు.

అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం చేయాలి

● డాక్టర్ రాందాస్ డిమాండ్

అడయార్, జనవరి 24: రాష్ట్ర శాసనసభ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయలేమంటూ మద్రాస్ హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసిందని గుర్తు చేశారు. అయితే, సమావేశాలు సజావుగా సాగేందుకు, సభలో జరిగే చర్చా కార్యక్రమాలు ప్రజలు నేరుగా తెలుసుకునేందుకు వీలుగా ఈ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆయన కోరారు.



చెన్నై, టి.నగర్‌లో వున్న శ్రీవారి ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం గాత్రకచేరీ చేసిన గాయత్రి విభావరిని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, మోహన్‌రావు, వూరా లక్ష్మీనారాయణ, రంగారెడ్డి తదితరులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వ్యాన్ ముందు భాగం

పెరంబూర్, జనవరి 24: శివగంగ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. రామనాథపురం జిల్లా పనైకుళం సమీపం అలగన్‌కుళానికి చెందిన నంబురాజన్, ఆయన భార్య కాళియమ్మాళ్ సహా 20 మంది తైపూసం సందర్భంగా పళని మురుగన్ ఆలయానికి పాదయాత్రగా వెళ్లి, స్వామి ని దర్శించుకుని మినీ వ్యాన్‌లో తిరుగుప్రయాణమయ్యారు. రామనాథపురానికి చెందిన మహమ్మద్ నడుపుతున్న వాహనం బుధవారం తెల్లవారుజామున శివగంగ జిల్లా దేవకోట సమీపం తిరుచ్చి - రామేశ్వరం జాతీయ రహదారి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో మినీ వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్ మహమ్మద్, నంబురాజన్, కాళియమ్మాళ్‌కు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దేవకోట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను అంబులెన్స్‌ల ద్వారా దేవకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసుదర్యాప్తు చేపట్టారు.

బాణసంచా కర్మాగారంలో ప్రమాదం

ఇద్దరి మృతి ● మరో ఇద్దరికి గాయాలు



పేలుడు దాటికి ధ్వంసమైన షెడ్

పెరంబూర్, జనవరి 24: విరుదాచలం సమీపం వచ్చకారపట్టిలో ఒన్న ఓ బాణసంచా కర్మాగారంలో బుధవారం జరిగిన పేలుడులో ఇద్దరు కార్మికులు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వచ్చకారపట్టిలో మురుగేశన్‌కు సొంతమైన బాణసంచా తయారీ కర్మాగారం ఉంది. నాగపూర్ సర్టిఫికెట్ పొందిన ఈ కర్మాగారంలో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కార్మికులు పనుల్లో ఉండగా, టపాసుల తయారీకి వినియోగిస్తున్న రసాయనాల మిశ్రమం నుంచి పొగలు వ్యాపించిన సెకన్లలోనే భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో కన్నిసేరిపుదూర్‌కు చెందిన కాళిరాజ్ (20), ముదలిపట్టికి చెందిన వీరకుమార్ (50) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అలాగే, గాయపడ్డ కన్నిసేరిపుదూర్‌కు చెందిన శరవణకుమార్, ఇనాంరెడ్డియపట్టికి చెందిన సుందరమూర్తి తదితరులను అగ్నిమాపక సిబ్బంది విరుదునగర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్... మృతుల కుటుంబీకులకు తన సంతాపాన్ని వ్యక్తం చేయడమే కాకుండా తలా రూ.3 లక్షల పరిహారాన్ని ప్రకటించారు.

అదనపు చార్జీ వసూలు చేసిన పరనూర్ టోల్‌గేట్‌కు రూ.50 వేల జరిమానా

పెరంబూర్, జనవరి 24: వాహన యజమాని నుంచి అదనపు చార్జీ వసూలుచేసిన పరనూర్ టోల్‌గేట్ నిర్వాహకులకు రూ.50 వేల జరిమానా విధిస్తూ వినియోగదారుల ఫోరం తీర్పు వెలువరించింది. చెంగల్పట్టు సమీపం మప్పేడుకు చెందిన ధనసింగ్ సొంతంగా టెంపో వ్యాన్‌ను అద్దెకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. 2021లో సేలయూర్ నుంచి ఖాళీ చేసిన ఇంటి సామాన్లను వ్యానులో ఎక్కించుకొని రామనాథపురం వెళ్లాడు. అందుకోసం తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 వేలతో ఫాస్టాగ్ రీచార్జి చేయించుకున్నాడు. రామనాథపురంలో సామానులు దించిన ధనసింగ్ తిరుగుప్రయాణం కాగా, పరనూరు చెక్‌పోస్ట్ సిబ్బంది, ఫాస్టాగ్ పనిచేయడం లేదని తెలిపి, టోల్ రుసుము రెండింతలు వసూలు చేశారు. ఈ విషయమై సంబంధిత బ్యాంకు అధికారులను ధనసింగ్ సంప్రదించగా, చెక్‌పోస్ట్ ఫాస్టాగ్ సక్రమంగా పనిచేస్తోందని, ఎలాంటి సాంకేతికలోపం తలెత్తలేదని తెలిపారు. దీంతో ధనసింగ్ ఈ వ్యవహారంపై చెంగల్పట్టు జిల్లా వినియోగారుల ఫోరంలో 2022 సెప్టెంబరు 6వ తేదీ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన ఫోరం, ధనసింగ్ ఫాస్టాగ్ బ్యాంక్ ఖాతాలో తగిన నగదు ఉన్నా, అతని వద్ద అదనంగా రుసుము వసూలు చేయడం నేరమని పేర్కొంటూ, టోల్ గేట్ నిర్వాహకులకు రూ.50 వేలు జరిమానా, కేసు ఖర్చులకు రూ.10 వేలు అందించాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోవై సమస్యాత్మక ప్రాంతాల్లో మూడంచెల భద్రత



పోలీసు జాగిలంతో తనిఖీలు

అడయార్, జనవరి 24: ఈనెల 26వ తేదీ భారత గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కోయంబత్తూరు నగరంలో మూడంచెల భద్రత కల్పిస్తున్నారు. ముఖ్యంగా న గరంలోని విమానాశ్రయంతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్లు, ఆలయాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రయాణికుల లగేజీలను పోలీసుల జాగిలాలు, మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేస్తున్నారు.

8 చోట్ల ఐటీ సోదాలు

అడయార్, జనవరి 24: నగరంలో ఎనిమిది ప్రాంతాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఐటీ అధికారులు సోదాలు చేసిన కంపెనీల్లో కెవిన్ స్టీల్స్, సిద్ధార్థ్ ట్రేడర్స్ వంటి బడా కంపెనీలతో పాటు మరికొన్ని సంస్థలున్నాయి. ఈ కంపెనీలు పన్ను ఎగవేతకు పాల్పడినట్టు వచ్చిన సమాచారం మేరకు ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

రక్త గాయాలతో యువకుడి మృతదేహం

అడయార్, జనవరి 24: స్థానిక రాజీవ్‌గాంధీ వైద్య కాలేజీ మైదానంలో యువకుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేయగా, వారు ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 30 యేళ్ల యువకుడి వివరాల కోసం పోలీసులు విచారణ జరపుతున్నారు. 20 అడుగుల ఎత్తు ఉన్న వంతెన నుంచి పడటం వల్ల మృతి చెందాడా? లేక గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి మైదానంలో పడేశారా అన్నదానిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో 'రెండాకులు' కష్టమే!

● ఓపీఎస్ మద్దతుదారుడు వైద్యలింగం

ప్యారీస్, జనవరి 24: పార్లమెంటుకు జరగబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే రెండాకుల గుర్తుపై పోటీ చేయడం కష్టమేనని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మద్దతుదారుడు వైద్యలింగం అభిప్రాయపడ్డారు. తంజావూరులో బుధవారం ఓపీఎస్ మద్దతుదారుల సమావేశం వైద్యలింగం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎడప్పాడి పళనిస్వామి డబ్బుకు, పదవిపై మోజుపడి అన్నాడీఎంకేను నడుపుతున్నారని, ఆయన తనను సూపర్ ఎంజీఆర్‌గా భావించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఆయనను కాంట్రాక్టర్లు మాత్రమే సంప్రదించ గలిగారని, పార్టీ కోసం కష్టపడిన నిర్వాహకులు, కార్యకర్తలను ఈపీఎస్ దగ్గర చేర్చలేదని విమర్శించారు.



లైకా ప్రొడక్షన్స్ బ్యానరుపై అదితి శంకర్!

ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న చిత్రంలో హీరోయిన్ అదితి శంకర్ నటించనున్నారు. డెబ్యూ డైరెక్టర్ తెరకెక్కించే ఈ చిత్రంలో అదితి ప్రధాన పాత్ర పోషించనున్నారని కోలీవుడ్ సమాచారం. నిజానికి ఈ చిత్రంలో సీనియర్ హీరోయిన్ నయనతార లేదా సాయిపల్లవి నటించనున్నారనే వార్తలు వచ్చాయి. కానీ, అదితి శంకర్ నటించనున్నట్టు సమాచారం. కాగా, ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ కుమార్తెగా సినీ రంగ ప్రవేశం చేసిన ఈ వైద్యురాలు... 'విరుమన్'లో తొలిసారి హీరో కార్తీ సరసన నటించారు. ఆ తర్వాత శివకార్తికేయన్ నటించిన 'మావీరన్' లో నటించగా, ఇపుడు విష్ణువర్థన్ దర్శకత్వంలో రూపొందే కొత్త చిత్రంలో నటిస్తున్నారు. అలాగే, సూర్య నటించే 43వ చిత్రంలో కూడా అదితి శంకర్ నటించనున్నారు.

చిత్రజ్యోతి



ఇనియా

దర్శకత్వం చేయాలన్నదే నా కోరిక : ఇనియా

నటిగా కొనసాగుతున్నా తనకు దర్శకత్వం చేయాలనే కోరిక ఉందని యువ నటి ఇనియా అన్నారు. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు ఆన్‌లైన్‌లో దుస్తులు విక్రయిస్తున్నారు. ఈ షోరూం మొదటి వార్షికోత్సవంతో పాటు తన పుట్టిన రోజు వేడుకలను ఆమె ఒకే రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ...'నేను నటించిన 'తూక్కుదురై' చిత్రం ఈ వారం విడుదలకానుంది. తొలిసారి హాస్యభరిత చిత్రంలో నటించాను. ఇందులో యోగిబాబుకు హీరోయిన్‌గా నేను నటించలేదు. కన్నడం, మలయాళం వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నా. నా కోరిక కార్యరూపం దాల్చేందుకు మరికొంత సమయం పడుతుంది. కరోనా సమయంలో ఆన్‌లైన్ దుస్తుల షోరూంను ప్రారంభించాను. బాగా క్లిక్ అయింది. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఓ దర్శకుడు సినిమాలకు సరిపోవని చెప్పారు. కానీ, ఇపుడు ఒక నటిగా, వ్యాపారవేత్తగా బిజీగా ఉన్నా' అని చెప్పారు.



రామ మందిర ప్రారంభోత్సవం ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం

● రజనీకాంత్

అయోధ్య నగరంలో రామ మందిర ప్రారంభోత్సవం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం అని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగిన రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని, తిరిగి చెన్నైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'రామాలయాన్ని చూసిన తొలి 150 మంది ముఖ్య అతిథుల్లో నేను ఒకడినన్న విషయం తలచుకుంటే ఎంతో సంతోషంగా, ఆనందంగా ఉంది' అన్నారు. రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ఒక రాజకీయ కార్యక్రమం అంటూ వస్తున్న విమర్శలపై... 'ఒక్కొక్కరి దృష్టికోణం ఒక్కోవిధంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి దృష్టి కోణం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదు. ఆ అభిప్రాయం వారి వ్యక్తిగతంగా భావిస్తా. నేను మాత్రం ఒక ఆధ్యాత్మిక కోణంలో చూస్తున్నా' అని రజనీ అన్నారు.

'గట్టాకుస్తీ' కాంబినేషన్‌లో చిత్రం

హీరో విష్ణు విశాల్ - దర్శకుడు చెల్లా అయ్యావు కాంబినేషన్‌లో గతంలో వచ్చిన చిత్రం 'గట్టాకుస్తీ'. ఐశ్వర్యలక్ష్మి హీరోయిన్‌గా నటించారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందించారు. 2022లో తమిళం, తెలుగు భాషల్లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదారణ పొందింది. రెడ్ జెయింట్ మూవీస్ తమిళంలో విడుదల చేసింది. రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం ఏకంగా రూ.30 కోట్ల మేర వసూళ్లను రాబట్టింది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం దర్శకుడు చెల్లా అయ్యావు దర్శకత్వంలో విష్ణువిశాల్ మరో చిత్రంలో నటించనున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. త్వరలోనే ఈ చిత్రం వివరాలతో పాటు అందులో నటించే నటీనటుల వివరాలు, చిత్రానికి పనిచేసే సాంకేతిక నిపుణులు వివరాలను అధికారికంగా వెల్లడించారు.



చెల్లా అయ్యావు - విష్ణు విశాల్





ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో వసతులు

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఏసీ ఎగ్జిక్యూటివ్ లాంజ్

పెరంబూర్, జనవరి 24: స్థానిక చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో తొలిసారిగి ఎగ్జిక్యూటివ్ లాంచ్ ప్రారంభమైంది. స్టేషన్ ప్రాంగణంలోని 6 ప్లాట్‌ఫాం సమీపంలో రూ.17.75 కోట్ల తో విమానాశ్రయ తరహా అత్యాధునిక సదుపాయాలతో ఈ లాంజ్ ఏర్పాటైంది. 180 మంది బస చేసేలా ఏర్పాటైన ఈ లాంజ్‌లో 112 సింగిల్ సోఫాలు, 18 సింగిల్ స్లీపింగ్ ప్యాడ్లు, 4 డబుల్ స్లీపింగ్ ప్యాడ్లు ఉన్నాయి. 34 సీట్లతో ఏర్పాటైన డైనింగ్ హాలులో శాఖాహార, మాంసాహార వంటకాలు అందజేయనున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరు రెస్ట్ రూమ్‌లు, స్నానపు గదులు, లగేజీ భద్రపరిచేందుకు ప్రత్యేక రాక్ ఏర్పాటయ్యాయి. ఉచిత వైఫై, టీ, కాఫీతో గంట సేపు బస చేసేందుకు రూ.200 చార్జీగా నిర్ణయించారు. అలాగే, వాటర్ బాటల్, శీతల పానీయం, వైఫై, దిండు, దుప్పటి సదుపాయంతో సింగిల్ స్లీపింగ్ ప్యాడ్‌లో మూడు గంటల బసకు రూ.840 చార్జీగా నిర్ణయించారు. సమాయాన్ని బట్టి ఛార్జీల ధరలు మారుతుంటాయి. పూర్తి ఎయిర్ కండిషన్ సౌకర్యంతో ఉన్న ఈ ఎగ్జిక్యూటివ్ లాంజ్ రైలు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

గణతంత్ర వేడుకలకు ముస్తాబవుతున్న మెరీనా తీరం

● ముగిసిన 'రిపబ్లిక్ డే రిహార్సల్స్'

పెరంబూర్, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రిదళాలు, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌సీసీ విభాగాలు బుధవారం మెరీనా బీచ్ సమీపంలోని కామరాజర్ రోడ్డులో తుది రిహార్సల్స్ నిర్వహించాయి. చెన్నైలో మెట్రోపనుల కారణంగా గత ఏడాది గణతంత్ర వేడుకలు మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో కాకుండా మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డులో వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా అదే ప్రాంతంలో వేడుకలు నిర్వహించేందుకు వేదిక ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, గణతంత్ర వేడుకలకు సంబంధించిన రిహార్సల్స్ ఈ నెల 19, 22 తేదీల్లో నిర్వహించారు. సీఐఎస్ఎఫ్, కోస్ట్ గార్డ్, హోంగార్డ్, ఎన్‌సీసీ, జానపద కళాకారులు, అశ్వ దళం, అగ్నిమాపక శాఖ తదితరాలు పాల్గొన్నాయి. అలాగే, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పూర్తి వేషధారణతో పలురకాల కళా ప్రదర్శనలతో రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. కాగా 21 ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు కూడా రిహార్సల్స్‌లో పాల్గొన్నాయి. సమాచార, ప్రసార శాఖకు చెందిన రెండు శకటాలు, పోలీసు, కో-ఆపరేటివ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఆరోగ్యశాఖ, ఎన్ఎస్‌సీ తదితర శాఖల శకటాలతో నిర్వహించిన రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. రిహార్సల్స్ సమయంలో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్లు పూలు చల్లుతూ వెళ్లాయి. ఈ సందర్భంగా కామరాజర్ రోడ్డులో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు.



భరత మాత వేషధారణలో విద్యార్థుల నృత్యం



నాట్య ప్రదర్శనలో విద్యార్థులు



విభిన్న వర్గాల వేషధారణలో విద్యార్థులు



జానపద నృత్యంతో విద్యార్థులు

ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆఫ్రికా డెస్క్ ప్రారంభం

ప్యారీస్, జనవరి 24: స్థానిక నందనం సీఐటీ నగర్‌లోని వెలగపూడి రామకృష్ణ భవనంలో ఉన్న ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) ఆధ్వర్యంలో బుధవారం ఆఫ్రికా డెస్క్‌ను ఏసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ ప్రారంభించారు. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు సాగిన ఈ ప్రారంభోత్సవంలో ఏసీసీ నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొని ఆఫ్రికాలో అందుబాటులో ఉన్న వాణిజ్య అవకాశాల గురించి ప్రశ్నలడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా వీఎల్ ఇందిరాదత్ మాట్లాడుతూ... ఆఫ్రికాలో మెరుగైన వాణిజ్య సంబంధాలు పెంపొందించడానికి అనుకూలంగా ఈ డెస్క్ ప్రారంభించినట్లు చెప్పారు. 2024 డిసెంబరులో భారతదేశం నుంచి ఏసీసీ ప్రతినిధులు ఆఫ్రికాలో పర్యటించేలా పథకం రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఆఫ్రికా డెస్క్ ద్వారా ఏసీసీ సభ్యులకు ఆ దేశంలో ఉన్న వ్యాపార సంస్థలతో అవకాశాలు అందిపుచ్చుకోవడం, అక్కడి నుంచి వచ్చే ప్రతినిధులతో వాణిజ్య సంబంధమైన సమావేశాలు ఏర్పాటు చేయడమే ముఖ్య ఉద్దేశమని ఆమె చెప్పారు. ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ కమిటీ ఛైర్మన్ ఆర్ఆర్ పద్మనాభన్, సభ్యులు షీలా సుధాకరన్, బైజూ కుమార్... ఆఫ్రికాలో అందుబాటులో ఉన్న పండ్లు, శీతల పానీయాల పాంట్లు, మైనింగ్, ఆసుపత్రులు, పర్యాటక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ప్రపంచంలో వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆఫ్రికా ఒకటని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీసీ కమిటీ సభ్యురాలు కవితా దత్, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ ఛైర్మన్ కేఎస్ సురేష్‌బాబు, ఇతర సభ్యులు పాల్గొనగా, ఉపాధ్యక్షుడు నరసింహన్ వందన సమర్పణ చేశారు.



ఆఫ్రికా డెస్క్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఏసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరా దత్

క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేదు...

● క్యూ ఆర్ కోడ్ ద్వారా మెట్రోరైలు టిక్కెట్లు



పెరంబూర్, జనవరి 24: వాట్సప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ వినియోగించి మెట్రో రైలు టిక్కెట్లు పొందే సౌకర్యం ఈనెల 24న బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. 2015లో మెట్రోరైలు సేవలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వింకోనగర్ - సెయింట్ థామస్ మౌంట్, పార్క్ - విమానాశ్రయం (వయా కోయంబేడు) మార్గంలో మెట్రోరైళ్ల నడుస్తుండగా, ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణం చేస్తున్నారు. తొలుత కాగిత టిక్కెట్ల ద్వారా మెట్రో రైలు ప్రయాణం చేపట్టగా, తదనంతరం డిజిటల్ విధానంలో మొబైల్ ద్వారా టిక్కెట్లు పొందే సదుపాయం కల్పించారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టిక్కెట్లు పొందే సౌకర్యం బుధవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు, ఇకపై టిక్కెట్ల కోసం ప్రయాణికులు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేదని సీఎంఆర్ఎల్ తెలియజేసింది.



వాహనాలు ప్రారంభిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

మైలాపూర్ కేసరి పాఠశాలలో గణిత ప్రయోగశాల

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో గణిత ప్రయోగశాల ఏర్పాటైంది. దీన్ని ఆ విద్యాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ కేఎన్ కేసరి ముని మనవడు, ప్రఖ్యాత సినీ గాయకుడు ఉన్నికృష్ణన్ బుధవారం లాంఛనంగా ఆవిష్కరించారు. కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు గణితాన్ని బోధించాలనే సదాశయంతో 'అల్టిస్ ఫౌండేషన్' అధ్యక్షులు కీర్తివాసన్ సహకారంతో పాఠశాల కార్యదర్శి కేఎస్‌పీ ప్రసాద్ కృషితో ఈ ప్రయోగశాల ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాల స్థాయిలోని విద్యార్థినీ విద్యార్థులకు సులభంగా గణితం బోధించేందుకు ఈ ప్రక్రియ సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉన్నికృష్ణన్ కేసరి విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యవర్గ సభ్యులు డాక్టర్ పీజే చారుమతి, పి.కృష్ణ, వెంకటరమణ తదితరులు కూడా పాల్గొన్నారు.



కేసరికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గ్రేటర్‌లో రూ.810 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

● మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, జనవరి 24: గ్రేటర్ చెన్నైలో రూ.801 కోట్లతో రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేపాక్కంలోని తమిళనాడు వాటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో రూ.1.35 కోట్లతో కొనుగోలు చేసిన 13 కొత్త వాహన సేవలను బుధవారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటివరకు 4.20 కోట్ల మందికి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నామని, ఈ మూడు నెలల్లో అదనంగా మరో 3 కోట్ల మందికి ఈ వసతి కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే పథకం మరో 10 రోజుల్లో ప్రారంభమవుతుందని చెప్పారు. వాటర్ బోర్డులో ఉన్న ఇంజనీర్లు తమకు కేటాయించిన ప్రాంతాలకు సకాలంలో వెళ్లి పనులు చేపట్టేందుకు వీలుగా కొత్త వాహనాలను ప్రభుత్వం తరపున అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం స్టాలిన్ విదేశీ పర్యటన అనంతరం నెమ్మేలీ నిర్లవణ కేంద్రం, మదురై, తిరుప్పూర్, కోయంబత్తూర్ జిల్లాల్లో అతిపెద్ద తాగునీటి పథకాలను ప్రారంభించే పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

సాలిగ్రామంలో 'గ్రో హెయిర్ గ్లో స్కిన్ క్లినిక్'

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాలిగ్రామం ఆర్కాట్‌రోడ్డులో 'గ్రో హెయిర్ గ్లో స్కిన్ క్లినిక్' ఏర్పాటైంది. దీన్ని మాజీ ఎమ్మెల్యే వీఎస్ రవి, టెక్స్‌టైల్ బోర్డు మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఆనందకుమార్, డాక్టర్ వీఎస్ అజయ్ చంద్రశేఖర్, శరణ్ వేల్, ఆర్.సత్యప్రియ తదితరులు బుధవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అసాధారణమైన సేవ, అత్యాధునిక సాంకేతికత, జుట్టు పెరుగుదలకు అందుబాటులో ఉండే పరిష్కారాలను అందించడానికి తాము అంకితమైనట్లు పేర్కొన్నారు. ఇక్కడ సమగ్ర ఉన్నతశ్రేణి చికిత్సలను అందిస్తున్నామన్నారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

బీజేపీకి దేశభక్తి లేదు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి



ప్యారీస్, జనవరి 24: భారతీయ జనతా పార్టీకి దేశభక్తి లేదని, అందువల్లే కాషాయ నేతలు చారిత్రాత్మక జాతీయ జెండాను ఎగురవేసేందుకు ముందుకు రావడం లేదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి ఘాటుగా విమర్శించారు. మహాత్మాగాంధీ వల్ల దేశానికి స్వాతంత్ర్యం రాలేదని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి తీవ్రంగా విమర్శించారని, ఆయనకు దేశ చరిత్ర గురించి అవగింజంతైనా తెలియదన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సుభాస్ చంద్రబోస్ చేపట్టిన ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి సహకరించిందని, అయితే రెండో ప్రపంచ యుద్ధంలో బోస్‌కు మద్దతు తెలిపిన దేశాలు ఓటమి చవిచూడడంతో ఆయన వెనకుక తగ్గినట్లు చరిత్రలో స్పష్టంగా ఉందన్నారు. దీన్ని బీజేపీ పెద్దలు, గవర్నర్ తెలుసుకొని మాట్లాడాలని అళగిరి హితవు పలికారు.

రెండు రోజులు వరుస సెలవులు

● దుకాణాల ముందు బారులు తీరిన మద్యం ప్రియులు

ప్యారీస్, జనవరి 24: ఓటరు దినం, రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో టాస్మాక్ మద్యం దుకాణాలు పనిచేయవని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. దీంతో రెండు రోజులకు అవసరమైన మద్యాన్ని కొనుగోలు చేసేందుకు తరలివచ్చిన మద్యం ప్రియులతో దుకాణాలు కిటకిటలాడాయి. టాస్మాక్ చిల్లర మద్యం దుకాణాలు, బార్లు, హోటళ్లు, రిసార్టులు, క్లబ్‌లలో రెండు రోజులు మద్యపానీయాలు విక్రయించరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మద్యం దుకాణాలు ప్రారంభం కాక ముందే మందుబాబులు పెద్దసంఖ్యలో బారులుతీరారు. సాధారణ రోజుల్లో రెండు క్వార్టర్లు కొనుగోలు చేసే వారు సెలవులు కారణంగా ఆరు బాటిల్స్ కొనుగోలు చేశారు. కాగా, సెలవులను దృష్టిలో ఉంచుకొని మద్యం దుకాణాల్లో అధికంగా బీరు, మద్యం రకాలను టాస్మాక్ సంస్థ నిల్వ ఉంచింది.

పళనిలో రూ.1.13 కోట్లతో కొత్త ఎలక్ట్రిక్ రోప్ కారు

● ప్రారంభించిన ఆలయ అధికారులు



కొత్తగా ప్రారంభిస్తున్న ఎలక్ట్రిక్ రోప్ కారు

అడయార్, జనవరి 24: పళని మురుగన్ ఆలయంలో భక్తులు కష్టపడకుండా కొండపైకి చేరుకునేందుకు కొత్తగా మరో ఎలక్ట్రిక్ రోప్ కారును అందుబాటులోకి తెచ్చారు. రూ.1.13 కోట్లతో ఈ ఎలక్ట్రిక్ రోప్‌కారును అందుబాటులోకి తీసుకుని రాగా, దీన్ని ఆలయ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ఆలయంలో భక్తుల కోసం మూడు ఎలక్ట్రిక్ కార్లు ఉన్నాయి. వీటిలో కొండ కింది నుంచి పైభాగంలోకి వెళ్లేందుకు కనీసం 8 నుంచి 10 నిమిషాల సమయం పడుతోంది. వీటిలో ప్రయాణిందుకు ఒక్కో భక్తుడి నుంచి రూ.25, చిన్న పిల్లలకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో ట్రిప్పులో 32 మంది మాత్రమే ప్రయాణించే వీలుంది. దీంతో భక్తులు అధిక సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో 2023 జనవరిలో రూ.1.31 కోట్లతో ఎలక్ట్రిక్ రోప్ కారును అందుబాటులోకి తీసుకుని రావాలని నిర్ణయించారు. ఏసీ సౌకర్యంతో ఒకేసారి 72 మంది ప్రయాణించేలా కారును రూపొందించారు. ఇందుకోసం కొత్తగా నిర్మించిన ట్రాక్‌ను ఐఐటీ నిపుణులు రెండుసార్లు తనిఖీ చేశారు. దీన్ని ఆలయ ట్రస్టీ ఛైర్మన్ చంద్రమోహన్, ఇతర అధికారులు కలిసి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు.